క్లుప్తంగా

అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



స్వామివారి సన్నిధిలో భక్తులు

అచ్యుతాపురం (అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని ఎం.జగన్నాథపురంలో శనివారం అభయాంజనేయస్వామి ఆలయ 9వ వార్షికోత్సవం నిర్వహించారు. బాల దుర్గా యంగ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వేద పండితులు సాయి ఆంజనేయస్వామి వారిని తమలపాకులతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిపారు. భీముని నాగేశ్వరరావు, సేనాపతి కాశీ నాయుడు, శివాలయం కమిటీ చైర్మన్ మత్తుర్తి బ్రహ్మాజీ, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మణికంఠ క్షేత్రం వార్షికోత్సవం



మణికంఠ క్షేత్రంలో లక్ష్మీ గణపతి హోమం

రాంబిల్లి: దిమిలి గ్రామంలో శనివారం మణికంఠ క్షేత్రం ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీ గణపతిహోమం నిర్వహించారు. అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. 18 మెట్లకు హారతి ఇచ్చారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటాలు నిర్వహించారు.

చినరామభద్రపురంలో 104 వైద్య సేవలు

నక్కపల్లి : దేవవరం శివారు చినరామభద్రపురంలో శనివారం 104 వాహనం ద్వారా వైద్య సేవలు అందించారు. 104 వాహన సిబ్బంది గ్రామానికి చెందిన సుమారు 50 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వార్డు సభ్యుడు సఖిరెడ్డి వెంకటరమణ తెలిపారు. గొడిచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిశోర్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. జ్వరం కీళ్ల నొప్పులు కలిగిన వారికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడం జరిగిందని వైద్యాధికారి కిశోర్ తెలిపారు.

సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలి

కోటవురట్ల : స్త్రీనిధిని ఉపయోగించి ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ కోరారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో అధికారులు, వీవోఏలతో శనివారం సమీక్ష చేశారు. పీడీ లక్ష్మీపతి మాట్లాడుతూ గ్రామైక్య సంఘాల సభ్యులు స్త్రీనిధి నిధులతో సొంత వ్యాపారాల ద్వారా ఉపాధి పొందేలా కృషి చేయాలన్నారు. సంఘాలు అభివృద్ధి చెందడంతో పాటు రుణాల చెల్లింపులు సక్రమంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఏపీఎం కరుణానిధి, ఏపీఎం రమణకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలి

రాంబిల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు జి. కోటేశ్వరరావు అన్నారు. రాంబిల్లిలో శనివారం ఆయన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంపన్న వర్గాలకు మేలు చేసే విధానాలను అనుసరిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీరును వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దేముడునాయుడు పాల్గొన్నారు.

ముగిసిన పదో తరగతి పరీక్షలు

యలమంచిలి : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో శనివారంతో ముగిశాయి. యలమంచిలి పట్టణంలో ఏర్పాటు చేసిన 4 పరీక్ష కేంద్రాలు తులసీనగర్ బాలికల ఉన్నత పాఠశాల, చైతన్య టెక్నో స్కూల్, కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సెయింట్ మేరీ స్కూల్లో సమారు 900 మంది పదోతరగతి విద్యార్థులు సోషల్ పరీక్షకు హాజరయ్యారని ఎంఈవో విశ్వనాథం తెలిపారు. పది, ఇంటర్ ఓపెన్ స్కూల్ పరీక్షలు కూడా ముగిశాయని తెలిపారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ సందడిగా గడిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

మునగపాక : నాగులాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి పద్మావతి ఆర్థోపెడిక్ సెంటర్ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు ఈ శిబిరం ప్రారంభమవుతుందన్నారు. ఎముకల సాంద్రత పరీక్షలు, మందులు కూడా ఉచితంగా అందజేస్తారన్నారు.

పేటకు రూ. కోటి ఎంపీ నిధులు

- అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి వెల్లడి
- ఉపమాక మాడవీధుల్లో డ్రైనేజీలు ప్రారంభం



డ్రైనేజీ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి: కలియుగ దైవం, కల్కి అవతారమూర్తి అయిన ఉపమాక వేంకటేశ్వరస్వామి తిరుగాడే ఉపమాక మాడవీధుల్లో డ్రైనేజీల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం తనకు ఆ స్వామివారు కల్పించిన భాగ్యంగా భావిస్తున్నానని అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి అన్నారు. ఎంపీ నిధులు రూ.10లక్షలతో ఉపమాక మాడవీధుల్లో నిర్మించిన డ్రైనేజీ పనులు పూర్తి కావడంతో శనివారం ఆమె స్థానిక శాసన సభ్యుడు గొల్ల బాబూరావుతో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. పాయకరా వుపేట నియోజకవర్గం వెనుకబడి ఉందని, అధికంగా ఎంపీ నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే బాబూరావు తనను కలిసిన ప్రతిసారి కోరడం జరుగుతోందన్నారు. నియోజకవర్గ ఆడపడుచుగా తన ఎంపీ కోటా నిధుల నుంచి పాయకరావుపేట నియోజకవర్గానికి ఈ ఏడాది కోటిరూపాయలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఎమ్మెల్యే బాబూరావు మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ కింద ఉపమాక, శివారు గ్రామాలకు తాగునీటి సదుపాయం కల్పిస్తున్నామని, ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రోడ్ల నిర్మాణానికి రూ.5 కోట్లు కేటాయించామని త్వరలోనే ఈ పనులన్ని పూర్తి చేస్తామన్నారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే, ఎన్నికల పరిశీలకులను గ్రామస్తులు, మండల ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ రత్నం, జెడ్పీటీసీ కాసులమ్మ, వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, స్టూడెంట్ విభాగం అధ్యక్షుడు హరిబాబు, ఎంపీటీసీ బుజ్జి, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు మణిరాజు, బీసీ సెల్ నాయకుడు తాతారావు, సర్పంచ్‌లు భార్గవ్, సురేష్‌వర్మ, రాజబాబు, రత్నకుమారి, కొండలరావు, నాగ అప్పలరాజు, శ్రీను, ఎంపీటీసీలు తిరుపతిరావు, పార్వతి, గోవిందు, రమణ, దేవుళ్లు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో జగనే ఆదర్శం

యలమంచిలి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



ఓటీఎస్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రమణ మూర్తిరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ

మునగపాక : సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శ ముఖ్యమంత్రిగా గుర్తింపు పొందారని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) అన్నారు. మరో 30 ఏళ్ల పాటు జగన్‌మోహన్‌రెడ్డి ఈ రాష్ట్రానికి సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. నాగులాపల్లిలో శనివారం వలంటీర్లు, గృహ సారథులతో సమావేశం నిర్వహించారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నియోజకవర్గం వ్యాప్తంగా విజయవంతంగా నడుస్తుందన్నారు. వలంటీర్లు,గృహ సారథులు సమన్వయం చేసుకొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచాలన్నారు. అలాగే గత ప్రభుత్వానికి, ఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాను గుర్తించి వచ్చే ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించుకోవాల్సిన అవశ్యకతపై అవగాహన కల్పించాలన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు సింగర్‌రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, పార్టీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, సర్పంచ్ చినమ్మలు, ఎంపీపీ జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ చిందాడ దేవి, ఎంపీటీసీ మళ్ల కాశీ సురేష్, పార్టీ నేతలు ఉమామహేశ్వరరావు, సత్యనారాయణ, బుజ్జి, సూరప్పారావు,బాపునాయుడు పాల్గొన్నారు.

అర్హులైన నిరుపేదలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ఓటీఎస్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

మునగపాక: అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతుందని ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు అన్నారు. నాగులాపల్లిలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే రమణమూర్తిరజాఉ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందిన తీరుపై ఆరా తీయడంతో పాటు ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్హులై ఉండి పథకాలు అందకుంటే వారికి అవకాశం కల్పిస్తామన్నారు. పేదోడి సొంతింటి కల జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందన్నారు. జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు.

వైభవంగా వినాయకుని కళ్యాణం



సిద్ధి బుద్ధి సమేత కల్యాణ వినాయకుడి కల్యాణోత్సవం జరిపిస్తున్న పురోహితులు

రాంబిల్లి: పంచదార్ల పుణ్యక్షేత్రంలో శనివారం సిద్ధి, బుద్ధి సమేత కల్యాణ వినాయకుడి కల్యాణ మహోత్సవం కనులపండువగా జరిగింది. కల్యాణం మహోత్సవాన్ని పురోహితులు శాస్త్రోక్తంగా కమనీయంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిపారు. కోలాటాలు తప్పెటగుళ్లు, భజనలు అలరించాయి. భగవత్ భక్తి ప్రచార ట్రస్టు చైర్మన్ బి.శ్రీరామ్మూర్తి, సామాజిక కార్యకర్తలు ఎస్.నాగేశ్వరరావు, రమణ, నాయుడు పాల్గొన్నారు.

వేసవిలో ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

ఎస్.రాయవరం : వేసవి ఎండలకు వడదెబ్బ తగలకుండా ప్రతి ఒక్కరు జాగ్రతలు పడాలని పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేశ్వరి అన్నారు. గెడ్డపాలెం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. వైద్య శిబిరం నిర్వహించి 60 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలకు వెళ్లి కిశోర బాలికలకు వైద్య సూచనలు చేశారు. వేసవిలో ఎండ తీవ్రతకు తట్టుకునే జాగ్రత్తలు వివరించారు.

మునగపాక: ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తిమ్మరాజుపేట సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి కోరారు. తిమ్మరాజుపేటలో శనివారం ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ సేవలను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ విధానం అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. మెడికల్ ఆఫీసర్ షబ్నం, ఎంఎల్‌హెచ్‌పీ కిన్నెర, ఏఎన్‌ఎం ప్రేమకుమారి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



ఉపమాకలో జగనన్నకాలనీని సందర్శించిన ప్రత్యేకాధికారి రమామణి

నక్కపల్లి: మండలంలో ఉపమాక జగనన్న లేఅవుట్‌ను మండల ప్రత్యేకాధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమామణి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె లబ్ధిదారులతో మాట్లాడుతూ స్థలాలు పొందిన వారంతా త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఇళ్లనిర్మాణాలు ప్రారంభించకపోతే స్థలాలు రద్దు చేయబడతాయన్నారు. మండలంలో అన్ని గ్రామాల కార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీవో సీతారామరాజు, ఈవోపీఆర్‌డీ వెంకటనారాయణ, గృహనిర్మాణశాఖ అధికారులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు



కోటవురట్లలోని లే అవుట్‌లో సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

కోటవురట్ల : రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సొంతింటి కలను నెరవేర్చుకోవాలని మండల ప్రత్యేకాధికారిణి ఉదయశ్రీ సూచించారు. స్థానిక మహాలక్ష్మమ్మ తల్లి ఆలయం సమీపంలోని వైఎస్సార్ జగనన్న కాలనీ లే అవుట్‌లో శనివారం హౌసింగ్ డే నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారుల సమస్యలు తెలుసుకున్నారు. లబ్ధిదారులకు మెటీరియల్ అందుబాటులో ఉందని, బిల్లులు కూడా సకాలంలో మంజూరవుతున్నట్లు తెలిపారు. అనంతరం మండల పరిషత్ సమావేశ మందిరంలో సమీక్ష చేశారు.

తిమ్మాపురంలో చేతిబోరు ప్రారంభం



చేతిబోరు ప్రారంభిస్తున్న నాసా ప్రతినిధులు

ఎస్.రాయవరం : తిమ్మాపురం శివారు కోనవానిపాలెం గ్రామంలో చేతిబోరు ఏర్పాటుతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. నాసా సంస్థ ప్రతినిధులు గ్రామంలో తాగునీటి అవసరాలు నిమిత్తం ఈ బోరు ఏర్పాటు చేశారని వార్డు మెంబరు సింహాద్రి యాదవ్ తెలిపారు. సర్పంచ్ కర్రి సత్యనారాయణ పాల్గొన్నారు.

పారదర్శకంగా పాలన



వమ్మవరంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో నాయకులు

ఎస్.రాయవరం: ప్రతి ఇంటికి పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందని వమ్మవరం గ్రామసర్పంచ్ పాలపర్తి పాపారావు అన్నారు.వమ్మవరం గ్రామంలో శనివారం మానమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు.ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం నుంచి పొందిన పథకాలు ఎలా అందాయని ,వాటి వల్ల ప్రయోజనం కలిగిందా లేదా అని ప్రశ్నించారు. గతంలో ప్రభుత్వ సహాయం పొందాలంటే నాయకుల చుట్టూ పదే పదే ప్రదక్షణలు చేయాల్సి వచ్చేదని జగనన్న ప్రభుత్వం వచ్చాక నేరుగా పథకాలు అందుతున్నాయని లబ్ధిదారులు ఆనందంతో చెప్పారు. ఎంపీటీసీ సూరిబాబు, కన్వీనర్లు సత్యనారాయణ, మంగ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



మునగపాక బీసీ కాలనీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా బీచ్‌బాయ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.కోలాటం, మహిళల చిటికల భజన వంటి కార్యక్రమాలు అలరించాయి. - మునగపాక

వాలీబాల్ పోటీల విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మునగపాక సర్పంచ్ అప్పారావు

మునగపాక : క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం పెరుగుతుందని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు పేర్కొన్నారు. మునగపాక దళితవాడలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల విజేతలకు ఆయన శుక్రవారం రాత్రి బహుమతులు అందజేశారు. అంబేడ్కర్ యూత్ గార్డియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు, అంబేడ్కరిజమ్ పునాది అసోసియేషన్ అధ్యక్షుడు రాజాన బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు. కొప్పాక టీమ్‌కు ప్రథమ బహుమతి రాగా ద్వితీయ, తృతీయ బహుమతులను చందు టీమ్ హరిపాలెం, మడుతూరు టీమ్‌లు దక్కించుకున్నాయి.

భూసార పరీక్షలతో ఎంతో మేలు



రాంబిల్లిలో భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాయకరావుపేట : మండలంలో గల ఆయా గ్రామాల్లో భూసార పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ శాఖ ఏడీ టి.ఎస్.రాజ్‌కమల్ తెలిపారు. శనివారం నామవరంలో గల పొలాల్లో భూసార పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. భూసార పరీక్షలు నిర్వహించి, ఆ భూముల్లో ఏఏ పంటలు పండించుకోవాలో, సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంటలు వేసే విధానంపై అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ మండల అధికారి ఆదినారాయణ పాల్గొన్నారు.

కోటవురట్ల: సాగులో భూసార పరీక్షల ఆధారిత యాజమాన్య పద్ధతులు అవలంబించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు రాజ్‌కమల్ సూచించారు. ఆర్బీకేలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులకు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాజ్‌కమల్ మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించాలన్నారు. మొక్కల పెరుగుదలకు 16 రకాల పోషకాలు అందించాలన్నారు. మట్టి నమూనాలను సేకరించేటపుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇన్‌చార్జ్ ఏవో ఉమా ప్రసాద్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాంబిల్లి: భూసార పరీక్షలతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని కేవీకే శాస్త్రవేత్త బి. శ్రీహరిరావు అన్నారు. రాంబిల్లిలో శనివారం వీఏఏలు, రైతులకు భూసార పరీక్షల ప్రాధాన్యతపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన వీడియో, ఆడియో విధానంలో అవగాహన కల్పించారు. ఏవో సుమంత మాట్లాడుతూ భూసార పరీక్షలు ఆధారంగా ఎరువులు యాజమాన్యం పాటించాలన్నారు. దీనివల్ల నేల స్వభావం దెబ్బతినకుండా వుంటుందన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఏవో విజేత, ఏఈవోలు సంతోషి, దేముడు పాల్గొన్నారు.

మునగపాక: భూసార పరీక్షలకు అనుగుణంగా పంటల సాగు శ్రేయస్కరమని అనకాపల్లి వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ రామారావు అన్నారు. ఒంపోలు ఆర్‌బీకేలో శనివారం వీఏఏలు,వీహెచ్‌ఏలకు మట్టి నమూనాల సేకరణ–ఆవశ్యకతపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి, వ్యవసాయ విస్తరణ అధికారి లక్ష్మి పాల్గొన్నారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): నేల సారం, అందుబాటులో ఉండే పోషకాల బట్టి ఎరువులను వేయాలని నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు సూచించారు. శనివారం అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం గ్రామంలో రైతులతో నైరా కళాశాల విద్యార్థులు ముచ్చటించారు. మట్టి పరీక్షల ప్రాధాన్యతను వివరించారు. పొలాల్లో మట్టిని సేకరించి ల్యాబ్‌కు పంపాలన్నారు.

నన్ను ఆదుకున్న దేవుడు జగన్

దివ్యాంగుడి భావోద్వేగం



నక్కపల్లి: ఈ ఫొటోలో ఉన్న వ్యక్తి పేరు కొల్నాటి నూకరాజు. దివ్యాంగుడు. ఇతనికి వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేక వికలాంగుల పెన్షన్ రూ.5 వేలు మంజూరైంది. నెలనెలా వలంటీర్ ద్వారా ఇంటికే అందుతోంది. శనివారం ఎమ్మెల్యే బాబూరావు తదితరులు 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో భాగంగా అతని ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగినప్పుడు అతను భావోద్వేగానికి లోనయ్యాడు. ఆనందంతో కన్నీరు ఆపుకోలేకపోయాడు. జగనన్న తనను ఆదుకున్న దేవుడని చెప్పాడు. అతనిని ఎమ్మెల్యే సముదాయించారు. ప్రజా మద్దతు పుస్తకంలో నూకరాజు చెప్పిన విషయాలు నమోదు చేసి రశీదు ఇచ్చారు.

నియోజకవర్గంలో రూ.200 కోట్ల అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే బాబూరావు



కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి : అందరం కలిసికట్టుగా పనిచేద్దామని, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పిలుపునిచ్చారు. శనివారం ఆయన ఉపమాకలో కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. నియోజకవర్గంలో ఈ నాలుగేళ్లలో రూ.200 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 90 శాతం నెరవేర్చామన్నారు. నక్కపల్లిలో డిగ్రీ కళాశాల మంజూరు, నక్కపల్లి, కోటవురట్లలో 30 పడకల ఆస్పత్రులను 50 పడకల స్థాయికి పెంచామని, రూ.6 కోట్లతో అదనపు భవనాలు నిర్మించామని అన్నారు. పాయకరావుపేటలో రూ.1.17 కోట్లతో పీహెచ్‌సికి నూతన భవనాల నిర్మాణం, మిగిలిన ప్రాంతాల్లో పీహెచ్‌సీల మరమ్మతులు, రూ.16 కోట్లతో పలు గ్రామాలకు రోడ్డు సదుపాయం, నాడు నేడు పథకం కింద రూ.62 కోట్లతో పాఠశాలలో అభివృద్ధి పనులు, 9వేలమందికి ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు మంజూరు, రూ.200 కోట్లతో జల్‌జీవన్‌మిషన్ కింద ఇంటింటికి తాగునీటి సదుపాయం, రూ.110 కోట్లతో సచివాలయాలు, ఆర్‌బీకేలు నిర్మాణం వంటి అభివృద్ధి పనులు చేశామన్నారు. ప్రజల్లోకి వెళ్లి ఓటు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీకే ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీ సత్యవతి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసంరామకృష్ణ, ఎంపీపీ రత్నం, జెడ్పీటీసీ కాసులమ్మ, వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు పాపారావు, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు మణిరాజు, స్టూడెంట్ విభాగం అధ్యక్షుడు హరిబాబు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



బ్రోచర్లను లబ్ధిదారులకు అందిస్తున్న చిక్కాల రామారావు

పాయకరావుపేట : రాష్ట్ర ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ధ్యేయమని, అందుకే అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, ఉత్తరాంధ్ర రైతు విభాగం ఇన్‌ఛార్జ్, విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు చిక్కాల రామారావు అన్నారు. పెంటకోట గ్రామంలో మా నమ్మకం నువ్వే జగన్, మా భవిష్యత్తు నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్ళి ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు అమలు తీరు, పథకాలు పొందుతున్న లబ్ధిదారుల అభిప్రాయాలను అడిగి తెల్సుకున్నారు. లబ్ధిదారులు అభిప్రాయం మేరకు జగన్‌మోహన్ రెడ్డి స్టిక్కరును డోర్‌లకు అతికించారు. సర్పంచ్ చేపల నాగమణి తాతాజా, ఉపసర్పంచ్ చిక్కాల బాబు, హైస్కూల్ చైర్మన్ గేదెల చిన అప్పలరాజు పాల్గొన్నారు.

సోమలింగపాలెంలో మా నమ్మకం నువ్వే జగన్



సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరిస్తున్న పట్టణ సచివాలయ కన్వీనర్ శివ

యలమంచిలి : పేద ప్రజలకు సంక్షేమ పథకాలను అందించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని యలమంచిలి పట్టణ సచివాలయ కన్వీనర్ కర్రి శివ అన్నారు. శనివారం యలమంచిలి మున్సిపాలిటీ సోమలింగపాలెం గ్రామంలో మానమ్మకం –నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో శనివారం సాయంత్రం ఇంటింటికి వెళ్లి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అందుతున్న సంక్షేమ పథకాలు పట్ల లబ్ధి చేకూరటం గురించి ప్రజలకు వివరించారు. లబ్ధిదారుల ఇంటికి స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు గోవింద్ అయ్యలు నాయుడు పాల్గొన్నారు.

సర్వేలో నిర్లక్ష్యంపై ప్రత్యేకాధికారి ఆగ్రహం



సచివాలయ సిబ్బందితో సమీక్ష చేస్తున్న జీఎస్‌డబ్ల్యూఎస్ ప్రత్యేకాధికారి మంజులవాణి

కోటవురట్ల: సస్టెనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ సర్వే మూడు నెలలుగా జరుగుతున్నా ప్రగతి కనిపించలేదని, మీరు కేవలం జీతం తీసుకోవడానికి బయోమెట్రిక్ వేయడానికి మాత్రమే పనిచేస్తున్నట్టు కనిపిస్తోందంటూ అనకాపల్లి జీఎస్‌డబ్ల్యూఎస్ ప్రత్యేకాధికారి మంజుల వాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వే గురించి ప్రశ్నించినపుడు సిబ్బంది సరైన సమాధాన చెప్పకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతలు అప్పగించి మూడు నెలలు అవుతున్నా ఉదాశీనంగా ఉండడంపై మండిపడ్డారు. ఇలా పనిచేస్తే అందరికీ షోకాజ్ నోటీసు ఇవ్వాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎంపీడీవో చంద్రశేఖర్, మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల వేగం పెంచండి

ఎస్.రాయవరం : జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు మరింత వేగవంతంగా చేపట్టాలని డీఆర్‌డీఏ పీడీ, మండల ప్రత్యేకాధికారి లక్ష్మీపతి అన్నారు. హౌసింగ్ డే పురస్కరించుకుని కొరుప్రోలు రెవెన్యూ పరిధిలో తిమ్మాపురం గ్రామానికి కేటాయించిన జగనన్న కాలనీ లేఅవుట్‌లో శనివారం మండల అధికారులు సందర్శించారు.

ప్రతి ఒక్కరికీ పక్కా ఇల్లు ఉండాలని సీఎం జగన్ మోహన్‌రెడ్డి గ్రామాల్లో పెద్ద ఎత్తున లేఅవుట్లు వేసి స్థలాలు ఇవ్వడంతో పాటు ఇళ్ల నిర్మాణాలకు, రుణాలు, నీరు, విద్యుత్, రోడ్డు సదుపాయాలు కల్పించారన్నారు. ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధిదారులంతా ఇళ్లు నిర్మించుకోవాలన్నారు.

విపత్తులపై అప్రమత్తత అవసరం



అగ్ని మాపక వారోత్సవాల బ్రోచర్‌ను విద్యార్థులకు అందజేస్తున్న అధికారులు

యలమంచిలి : విపత్తులపై ప్రతి ఒక్కరు అప్రమత్తత కలిగి ఉండాలని యలమంచిలి విపత్తుల అధికారి రాంబాబు అన్నారు. శనివారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా యలమంచిలి పట్టణంలో ఆర్టీసీ కూడలి, ప్రధాన రహదారిలో అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కలిగేలా గాల్లోకి నీటితో ఫైరింగ్ వివిధ విన్యాసాలు ప్రదర్శించారు. పట్టణంలో విద్యాసంస్థలు, ఆస్పత్రులు, దుకాణాల్లో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఏవిధమైన చర్యలు చేపట్టాలో అగ్ని పోర్టల్ యాప్‌పై అవగాహన కల్పించారు. యలమంచిలి పట్టణంలో షాపు యజమానులకు అగ్నిమాపక వారోత్సవాల బ్రోచర్‌ను అందించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.